


కొనసాగుతున్న కులగణన

తెనాలిఅర్బన్: సమగ్ర కుల గణన సర్వే శనివారం తెనాలి పట్టణంలో కొనసాగింది. వార్డు వలంటీర్, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి బయోమెట్రిక్ వేయించారు.



30న రేపల్లెలో జాబ్‌మేళా

రేపల్లె రూరల్: రేపల్లెలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. వాల్ పోస్టర్‌లను శనివారం ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం శనివారం 520.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

శోభాయాత్రకు రాములోరి పంచలోహ విగ్రహాలు



తెనాలి: అయోధ్యలో రామమందిరం ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా పలు గ్రామాలు, పట్టణాల్లో శోభాయాత్రను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పలుచోట్ల రామభజన కార్యక్రమాలను చేస్తున్నారు. శోభాయాత్ర, రామ భజన నిమిత్తం అవసరమైన శ్రీరాముని విగ్రహాల కోసం పలు ప్రాంతాల్నుంచి భక్తులు స్థానిక శిల్పకారులను సంప్రదిస్తున్నారు. తెనాలి శిల్పకారుడు అక్కల రామలింగేశ్వరకుమార్ భక్తిభావనతో అడిగినవారికి కాదనకుండా రాములవారి పంచలోహ విగ్రహాలను ఒకరోజు నిమిత్తంగా ఇస్తున్నారు. చిలకలూరిపేట, గుంటూరు, విజయవాడ సహా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు శోభాయాత్ర కోసమని విగ్రహాలను సమకూరుస్తూ ఆనందాన్ని పొందుతున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

వేమూరు: అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సి.విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. అమృతలూరు మండలంలోని తురుమెళ్ల, భట్టిప్రోలు మండలంలోని పెదలంక, చుండూరు మండలం వలివేరు అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అమృతలూరు మండలం తురుమెళ్ల, భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు, కోళ్లపాలెం, చుండూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్లో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళలు గతేడాది డిసెంబరు 31 నాటికి 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు లోపు ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు గౌరవేతనం రూ. 11,500, సహాయకురాలికి గౌర వేతనం రూ.7,000 ఉంటుందని చెప్పారు. విద్యార్హత అంగన్‌వాడీ కార్యకర్తకు పదో తరగతి పాస్, సహాయకురాలికి 7వ తరగతి చదివి ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై కేసులు నమోదు

నెహ్రూనగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిబంధలు ఉల్లంఘించిన 105 కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు టోల్ ప్లాజా, పేరేచర్ల జంక్షన్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా బస్సులో సరుకులు చేరవేయడం, ప్రయాణికుల వివరాల పట్టిక నిర్వహించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడపడం, మల్టీ టోనడ్ హారన్, ఇతర పలు రకాల నిబంధనలను ఉల్లంఘించిచడంతో 105 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

24న అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ విభాగంలో అతిథి అధ్యాపక పోస్టుకు ఈ నెల 24న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులతో పాటు 50 ఏళ్ల వయసు పైబడిన పురుష అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఎంకాంలో కనీసం 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్, స్లెట్‌లో ఏదైనా ఒక అర్హత ఉండాలని చెప్పారు.

ఛే.. కూటమికిస్తే పోలా..

- బాపట్ల సీటుపై టీడీపీలో తర్జన భర్జన
- ఎటూ గెలవలేమని అంతర్మథనం
- ఇన్‌చార్జి వర్మపై అసంతృప్తి
- నియోజకవర్గంలో ముఖ్యనేతలు దూరం
- గెలవలేడంటూ అధిష్టానానికి సందేశాలు
- కూటమి రేసులో అన్నం సతీష్ ప్రభాకర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: టీడీపీ బాపట్లలో గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటోంది. అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతోంది. దీంతో 'పోటీచేసి పరువు పోగొట్టుకోవడమెందుకు... కూటమికి ఇచ్చి చేతులు దులుపుకుంటే సరి.' ఇది పచ్చపార్టీ సరికొత్త వ్యూహం. నియోజకవర్గంలో వరుస ఓటములతో టీడీపీ రాబోయే ఎన్నికల్లో ఆ సీటును కూటమికి కట్టబెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

నరేంద్రవర్మను నమ్మడం లేదు..

ప్రస్తుతం టీడీపీ బాపట్ల ఇన్‌చార్జిగా ఉన్న వేగేశన నరేంద్రవర్మ అభ్యర్థిత్వంపై ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్యనేతలు వ్యతిరేకతతో ఉన్నారు. గెలవని సీటులో పోటీచేసి అబాసుపాలు కావడం కంటే కూటమికి సీటిచ్చేస్తే పోలా...! అని ఆ పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం.

అభ్యర్థి ఎంపికపై పునరాలోచన..

బాపట్ల అసెంబ్లీ సీటు కేటాయింపు విషయంలో అధిష్టానం పునరాలోచనలో పడింది. ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఉన్నారు. ఆర్థికంగా బలవంతుడైనా సామాజిక వర్గం పరంగా తక్కువ ఓటు బ్యాంకు ఉంది. వర్మ టీడీపీ సీనియర్ నేతలతో పాటు ఓటు బ్యాంకు కలిగిన ముఖ్య నేతలను విస్మరించడంతో వారంతా అసంతృప్తితో ఉన్నారు.

ఎంతెంతదూరం..

తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి, బాపట్ల మాజీ ఎంపీపీ మానం విజేతలను వర్మ దూరం పెట్టారు. పమిడి భాస్కరరావు 2014 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఆశించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మినేని వెంకటేశ్వరరావు మనుమరాలు మానం విజేత టికెట్ ఆశిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యనిర్వక కార్యదర్శి బడుగు నాగేశ్వరరావు తోపాటు పలువురు వర్మపై అసంతృప్తితో ఉన్నారు.



కూటమి వైపు మొగ్గు..

బాపట్లలో వైఎస్సార్ సీపీని ఢీకొట్టలేమని భావించిన టీడీపీ అధిష్టానం సీటును పొత్తులో భాగంగా కూటమికి ఇస్తే సరిపోతుందని భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం ఆ దిశగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టీడీపీకి చెందిన కొందరు నేతల అభిప్రాయాలను సేకరించారు.

వర్మ అభ్యర్థిత్వంపై గరంగరం..

రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వర్మ అయితే వీరంతా ఆయనకు వ్యతిరేకంగా పనిచేసే అవకాశముంది. సర్దుకుపోవడం అటుంచి వీరిపై వ్యతిరేకత పెంచుకున్న వర్మ నియోజకవర్గ సమన్వయ కమిటీలో ఉన్న పమిడి భాస్కర్‌రావు, మానం విజేత, బడుగు నాగేశ్వరరావులను కమిటీ నుంచి తొలగించారు. దీంతో వీరంతా వర్మపై వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. వర్మ అభ్యర్థి అయితే వైఎస్సార్ సీపీకి పోటీ ఇచ్చే పరిస్థితి లేదని సదరు నేతలు ఇప్పటికే అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది.

బీసీ నాయకుడిపై దాడితో..

ఇటీవల యాదవ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ మండల స్థాయి నాయకులు మద్దిబోయిన రాంబాబుపై వర్మ, ఆయన కుమారుడు ఇద్దరు దుర్భాషలాడటమే కాకుండా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో నియోజకవర్గంలో సుమారు 35 వేల పైచిలుకు ఓటు బ్యాంక్ కలిగిన యాదవ సామాజికవర్గం వర్మపై ఆగ్రహంతో ఉంది. అధిష్టానం చేయించుకున్న సర్వేలోనూ వర్మపై సానుకూలత లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పోటీకి శ్రీనివాసరెడ్డి సిద్ధం..

బాపట్ల సీటు తనకు కేటాయించాలని అద్దంకి ప్రాంతానికి చెందిన ఆ పార్టీ తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, అధినేత చంద్రబాబుతో పాటు లోకేష్‌ను కోరినట్లు సమాచారం. బాపట్లలో రెడ్డి సామాజికవర్గం అధికంగా ఉండడంతో పోటీకి అవకాశం ఇస్తే పార్టీకి అనుకూలంగా ఉంటుందని వివరించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు నియోజకవర్గంలోని అసంతృప్తి నేతలు తనకు కలిసికట్టుగా మద్దతు పలికే అవకాశముందని ఆయన అధిష్టానానికి దృష్టికి తీసుకెళ్లి, సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

కూటమి చాన్స్ కోసం 'అన్నం'

ఈ పరిస్థితుల్లో ఇదే నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కూటమి నుంచి టికెట్ దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాపు సామాజిక వర్గానికి చెందిన ఆయనకు నియోజకవర్గంలో బలమైన వర్గముంది. 2014, 2019 ఎన్నికల్లో ఆయన బాపట్ల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. ఆ తరువాత పచ్చపార్టీని వీడి బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన కూటమి అభ్యర్థిగా బాపట్ల టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మురం చేసినట్లు తెలుస్తోంది.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

వేటపాలెం: వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని కొత్తపేటలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్, దేశాయిపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణంతో వేసవిలో కొత్తపేట ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య ఉండదని చెప్పారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా నాదృష్టికి తీసుకొని రావాలని సూచించారు. సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ పోతుల సునీత హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, రామన్నపేట సర్పంచి కందేటి రమణ, ఉప సర్పంచి దంతం వెంట సుబ్బారావు, జంగిలి రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి లేళ్ల శ్రీధర్, నాయకులు హనుమంతరావు, జి.మస్తాన్, ఈఈ థామస్ జాన్, డీఈ టీ గోపాలరావు, కనెక్షన్ డీఈ కట్టా వెంకటేశ్వర్లు, చీరాల డీఈ శ్రీని వాసరావు, వేటపాలెం ఏడీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరణం

రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎం జగనే

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. 'పల్లె పల్లెకు చిన హనిమిరెడ్డి' కార్యక్రమం మండలంలోని ధర్మవరంలో శనివారం రాత్రి నిర్వహించారు. గ్రామస్తులు హనిమిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ద్వారా పెన్షన్ అందటంతో అవ్వా, తాతల ఆనందానికి అవధులులేవని చెప్పారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలని కోరారు. అద్దంకి సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన నెలరోజులకే తనను కుటుంబ సభ్యుడిగా భావించి ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని జగనన్నకు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ అవిశెన జ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ కోరారు. 35వ జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన గోడ పత్రాలు, కరపత్రాలను కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ రహదారుల ప్రమాదాలు అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని చెప్పారు. మద్యం తాగి వాహనం నడపరాదని, రాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ చేయరాదని, అతివేగం అత్యంత ప్రమాదకరని వివరించారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణించరాదని, వాహనాలలో సీట్ బెల్ట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు. ప్రమాదాల నివారణపై ప్రజలకు పలు సూచనలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రహదారులపై ప్రమాదాలు జరిగితే గంటలోగా క్షతగాత్రులను సమీపంలోని వైద్యశాలకు స్వచ్ఛందంగా తరలించి ప్రజల ప్రాణాలు కాపాడాలని సూచించారు. శనివారం నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి కె.చంద్రశేఖర్ రెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు డీబీవీ రంగారావు, ఎన్.ప్రసన్నకుమారి, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పి.అంకమ్మరావు, కిషోర్‌బాబు, ఏటీబీ ఉషా, రాజశేఖర్ పాల్గొన్నారు.



రహదారుల భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ శ్రీధర్

ఎన్నికల వేళ చంద్రబాబు బీసీ జపమా !

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల

మార్టూరు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు బీసీ ఓటర్ల కోసం పడుతున్న తంటాలు ఆయనలోని ఓటమి భయానికి నిదర్శనమని మార్కెటింగ్ అండ్ కో ఆపరేటివ్ రాష్ట్ర సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీకి బీసీలే వెన్నుముక అని చెప్పుకునే చంద్రబాబు ఆ పరిస్థితి గత ఎన్టీ రామారావు హయాంలోనే ముగిసిపోయిందని చెప్పారు. బీసీ వర్గాలకు చంద్రబాబు తన హయాంలో ఏం చేశారో వారికి వివరించి చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు. కుల వృత్తులకు సంబంధించిన సామగ్రిని మాత్రమే ఇచ్చి వారిని అధికారానికి మాత్రం ఆమడ దూరంలో ఉంచిన ఘనత బాబుదేనని పేర్కొన్నారు.

బీసీలకు పెద్దపీట వేసింది.. సీఎం వైఎస్ జగనే..

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని బత్తుల పేర్కొన్నారు. బీసీలతో పాటు ఎంబీసీలను గుర్తించి 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌లు, 720 డైరెక్టర్లను నామినేట్ చేసి అధికారంలో భాగస్వాములను చేసింది సీఎం జగన్ కాదా అని ప్రశ్నించారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని స్మృతి వనం పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడం చారిత్రక ఘటన అని పేర్కొన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, చంద్రబాబు బూటకపు మాటలు బుద్ధిగా నమ్మి కౌగిలించుకుంటున్నారని, చంద్రబాబుది ధృతరాష్ట్ర కౌగిలి అన్న విషయం పవన్ కల్యాణ్ త్వరలోనే తెలుసుకోబోతున్నారని బత్తుల హితవు పలికారు.

బీఆర్ స్టేడియంకు
అంతర్జాతీయ సొబగులు

- పూర్తిస్థాయి క్రికెట్ స్టేడియంగా మార్పులు
- సుమారు రూ.50 కోట్లతో పనులు
- శాప్, మున్సిపల్ కార్పొరేషన్ కలిసి అభివృద్ధికి నిర్ణయం
- పనులు ప్రారంభించిన అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 1970 దశకంలో గవాస్కర్ సొగసైన డ్రైవ్స్, కపిల్‌దేవ్ స్వింగ్ బౌలింగ్‌తో అలరించిన మైదానం. పరుగుల రాణి పి.టి.ఉష అద్భుత ప్రదర్శనకు వేదికైన ప్రదేశం. రామనాథన్ కృష్ణన్ లాంటి దిగ్గజ టెన్నిస్ క్రీడాకారుల మాయాజాలానికి ప్రజలు ముగ్ధులైన ప్రాంతం. రెండు తెలుగు రాష్ట్రాల్లో తన విశిష్టతను చాటుకుంటున్న గుంటూరు నగరంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం. గత పాలకుల నిర్లక్ష్యంతో నిరాదరణకు గురైంది. ఈ స్టేడియానికి ఒక గుర్తింపు తీసుకురావాలని క్రీడా ప్రాధికార సంస్థ నిర్ణయించింది. దీంతో స్టేడియానికి అంతర్జాతీయ హంగులు రానున్నాయి.

1964లో 26 ఎకరాల్లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియానికి శంకుస్థాపన చేశారు. 1966లో ఇది క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చింది. మొత్తం రూ.10 లక్షలతో పూర్తి చేశారు. 1970 నుంచి 2010 వరకు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సైతం ఆతిథ్యం ఇచ్చింది. జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు ఓనమాలు నేర్పించింది ఇక్కడే. ఆ తర్వాత పాలకుల నిర్లక్ష్యానికి గురై నిరుపయోగంగా మారిపోయింది.

మళ్లీ ఇప్పుడు గత వైభవాన్ని తీసుకువచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. అవును అంతర్జాతీయ క్రికెట్ మైదానంగా రూపొందించేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. శాప్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా దీనిని చేపట్టారు. తొలి దశలో రూ.50 కోట్లు వెచ్చించి నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభించారు. క్రికెట్ గ్రౌండ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో విస్తరించేందుకు ఇప్పటికే గ్రౌండ్‌లో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టులు, బాక్సింగ్ రింగ్ పగలగొట్టారు. నూతన స్టేడియం నమూనాను సైతం రూపొందించారు. ప్రస్తుతం స్టేడియం విస్తీర్ణం సుమారు 18 ఎకరాలుంది. దీంట్లోనే అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆధునిక పద్ధతుల్లో

అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు ఆడాలంటే సెంటర్ వికెట్ నుంచి మైదానం నలుమూలల 70 మీటర్ల వ్యాసం ఉండాలి. ఇదే వ్యాసంతో నిర్మించబోతున్నారు. గ్యాలరీలను, పాత భవంతిని పడగొట్టి ఆధునిక భవనాలు నిర్మించనున్నారు. దీంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించనున్నారు. ప్రధాన మైదాన పిచ్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో రెండు బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు రెండు వాలీబాల్ కోర్టులు నిర్మించనున్నారు. వాకర్స్ కోసం 400 మీటర్ల పొడవు ఉన్న ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న స్కేటింగ్ రింక్ స్థానంలో పార్కింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రూ.68 లక్షలతో స్టేడియం ముందు భాగంలో దుకాణాల నిర్మాణం చేపట్టారు. దీంతోపాటు మైదానం చుట్టూ షాపులు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం షటిల్ కోర్టులను రూ.34 లక్షలతో ఆధునీకరిస్తున్నారు. సింథటిక్ టెన్నిస్ కోర్టును యథావిధిగా ఉంచుతారు. స్టేడియంలో పడిన వర్షం నీరు బయటకు పోయేందుకు వీలుగా డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసేందుకు నగరపాలక సంస్థ కూడా ముందుకు వచ్చింది. రూ.30 లక్షలతో డ్రైనేజీ పనులను నగరపాలక సంస్థ చేపట్టనుంది.



పనులను పరిశీలిస్తున్న జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు



బీఆర్ స్టేడియం గ్రౌండ్

రూపురేఖలు మారనున్నాయి

బీఆర్ స్టేడియం రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నాం. శాప్ చేపడుతున్న ఈ పనులకు నగరపాలక సంస్థ కూడా పూర్తిగా సహకారం అందిస్తోంది. మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి కూడా ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తున్నారు.

–వెంకటేశ్వరరావు, క్రీడాధికారి

క్లుప్తంగా

పశువులను సంరక్షించుకోవాలి



పర్చూరు(చినగంజాం): పశువులను సంరక్షించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ హనుమంతరావు సూచించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపాలెంలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో పశువుల బీమా పథకాన్ని గురించి ఆయన పశుపోషకులకు, రైతులకు వివరించారు. డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని సూచించారు. పశుగ్రాస విత్తనాలను 75 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తున్నామని, అదే విధంగా చాఫ్ కట్టర్స్‌ని కూడా సబ్సిడీతో ఇస్తున్నామని తెలిపారు. పశువుల ఆరోగ్య సంరక్షణ కార్డులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పర్చూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ మాధవి, పశువైద్యాధికారి అరుణ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

బల్లికురవ: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఇంట్లోనే పురుగు మందు తాగి మృతి చెందాడు. ఏఎస్‌ఐ బండి శ్రీనివారావు అందించిన వివరాలు.. మండలంలోని చెన్నుపల్లి గ్రామానికి చెందిన మందపాటి అంజయ్య(87) ఇంట్లో ఎవరులేని సమయంలో శుక్రవారం పురుగు మందు తాగాడు. భార్య కొన్నేళ్ల క్రితం చనిపోయింది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

పాత గుంటూరు: జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఫిర్యాదులు, సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ తెలిపారు. శనివారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన కార్యాలయంలో డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుంచి ఫోన్ ద్వారా సమస్యలను ఆయన తెలుసుకున్నారు. గుంటూరు విజయవాడ ప్రధాన రహదారిలో స్టాప్ లేని చోట డ్రైవర్లు బస్సులను ఆపి కాలాయాపన చేస్తున్నారని గుంటూరుకు చెందిన రమా వెంకటేశ్వరరావు తెలిపారు. పత్తిపాడు, పర్చూరు బస్సులకు నల్ల చెరువు వద్ద స్టాప్ కల్పించాలని ఆసిఫ్ కోరారు. ప్రయాణికులు నుంచి తెలుసుకున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని డిపో మేనేజర్లకు సూచించారు.

పార్కులతో ఆహ్లాదం ఆనందం

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- అంబేడ్కర్ పార్కు పట్టణ ప్రజలకు అంకితం



పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి, సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: ప్రశాంతతకు, ఆహ్లాదకర వాతావరణానికి నిలయాలు పార్కులని, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో పట్టణంలోని పార్కును అన్నిహంగులతో ఆధునీకరించి పట్టణ ప్రజలకు అందిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో రూ.20 లక్షలతో ఆధునికీకరించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు, ఓల్డ్‌టౌన్‌లో రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను శనివారం రాత్రి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పని ఒత్తిడితో విసిగిపోయిన పెద్దలకు, వినోదం కోరుకునే చిన్నారులకు పార్కులు ఎంతగానో ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు. ఓల్డ్‌టౌన్‌లో సుదీర్ఘకాలంగా ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యని శాశ్వత పరిష్కారం చూపామన్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన ఓల్డ్‌టౌన్‌లో వెలుగులు నింపి న్యూటౌన్ మార్చినట్లు చెప్పారు. ఇప్పటికే రాణిసత్రం పనులు పూర్తయి ప్రారంభమైందని వివరించారు. ఇండోర్ స్టేడియం, పాలిటెక్నిక్ కళాశాల, అంబేడ్కర్ భవనం, రైతుబజారు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఏఈ రోహిణి పాల్గొన్నారు.

టీ-20 ఫైనల్‌కు బళ్లారి, శ్రీకాకుళం జట్లు

హోరాహోరీగా సౌత్ ఇండియా స్థాయి మ్యాచ్‌లు

పర్చూరు(చినగంజాం): సౌత్ ఇండియా స్థాయి టీ-20 మ్యాచ్‌లు చివరి దశకు చేరుకున్నాయి. సెమీ ఫైనల్స్‌లో బళ్లారి, శ్రీకాకుళం టీంలు విజయం సాధించి ఫైనల్‌కు చేరాయి. పర్చూరులో నిర్వహిస్తున్న సౌత్ ఇండియా స్థాయి క్రికెట్ మ్యాచ్‌లో శనివారం రెండు సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు.

- మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ మ్యాక్ లెవెన్(బళ్లారి), మస్తాన్ లెవెన్(జార్ఖండ్) మధ్య జరిగింది. టాస్ గెలిచి బళ్లారి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసి భారీ లక్ష్యాన్ని జార్ఖండ్ ముందు ఉంచింది. జట్టులో తాహ 47 బంతుల్లో 101 పరుగులు సాధించాడు. వాటిలో 4 బౌండరీలు, 10 సిక్సర్లతో తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. మరో బ్యాటర్ ప్రవీణ్ దూబే 22 బంతుల్లో 50 పరుగులు చేసి జార్ఖండ్ బౌలర్లను బెంబేలెత్తించాడు. తరువాత బ్యాటింగ్‌కు దిగిన మస్తాన్ లెవెన్ 17.3 ఓవర్లలో ఆలౌట్ అయి 106 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో బళ్లారి 112 పరుగులతో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. సెంచరీ సాధించిన తాహ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ శ్రీనివాస్

శ్రీకాకుళం విజయం..

- మధ్యాహ్నం రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సిక్కోలు చీతాస్(శ్రీకాకుళం), ఒంగోలు బుల్స్ తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం నిర్ణీత 18 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. జట్టులో కేపీ సాయి రాహుల్ 41 బంతుల్లో 62 పరుగులు చేశాడు. అందులో 4 బౌండరీలు, 3 సిక్సర్లు ఉన్నాయి. అదే విధంగా ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ వేగంగా ఆడి 34 బంతుల్లో 55 పరుగులు సాధించాడు. తరువాత లక్ష్య ఛేదనకు దిగిన ఒంగోలు 16.2 ఓవర్లలో ఆలౌట్ అయి 131 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 36 పరుగుల తేడాతో శ్రీకాకుళం విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఒంగోలు జట్టులో గుట్టు రోహిత్ మాత్రమే 24 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. శ్రీకాకుళం బౌలర్ శ్రీనివాస్ 4 ఓవర్లలో 34 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. దీంతో శ్రీనివాస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ బళ్లారి, శ్రీకాకుళం మధ్య ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

గంజాయిని పరిశీలించిన ఎస్పీ



నగరంపాలెం: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల స్వాధీనం చేసుకున్న డ్రై, లిక్విడ్ గంజాయిని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పరిశీలించారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ హోదాలో పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానంలో శనివారం నిల్వ చేసిన గంజాయిని ఆయన నిశితంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల నల్లపాడు పీఎస్, పట్టాభిపురం పీఎస్, నగరంపాలెం పీఎస్, మంగళగిరి పట్టణ పీఎస్, తెనాలి ప్రాంతాల్లో డ్రై, లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఆయా కేసుల్లో పలువురిని అరెస్ట్ చేశామని చెప్పారు. కేసుల దర్యాప్తులో భాగంగా డ్రై, లిక్విడ్ గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యుల సమక్షంలో పరిశీలించామని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ రామ్నాథ్ హెగ్డే, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీలు పి.శ్రీనివాసరావు(డీసీఆర్‌బీ), శాంతకుమార్ (ఏఆర్) రత్నస్వామి(ఎస్‌బీ) పాల్గొన్నారు.

అంకితభావంతో 'బజరంగ్' ప్రజాసేవ



కళ్లజోళ్లు అందుకున్న వారితో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, ప్రజారంజకమైన పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా ఈనెల 11వ తేదీన చేబ్రోలు మండలం నారాకోడూరులో బజరంగ్ సంగమం కార్యక్రమంలో జరిగిన నేత్రజ్యోతి వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు 652 మందికి వ్యక్తిగత కళ్లజోళ్ల అవసరమని డాక్టర్లు నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ మేరకు తయారు చేయించిన కళ్లజోళ్లు అంబటి మురళీకృష్ణ గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారధి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పేదల పట్ల ఉన్న శ్రద్ధను విస్తృతస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బజరంగ్ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. నేత్ర సమస్యలతో బాధపడే వారికి ఊరట కలిగించి వెలుగునిచ్చే కార్యక్రమంగా బజరంగ్ నేత్రజ్యోతి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పనిచేస్తుందన్నారు. సీఎంని ఆదర్శంగా తీసుకుని కులమత, వర్గ, వర్ణ రాజకీయాలకు అతీతంగా ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని చెప్పారు.

అనుమతుల్లేని బయోస్టిమ్యులెంట్స్ విక్రయాలు నిలుపుదల

నగరంపాలెం: అనుమతుల్లేని వందలాది లీటర్ల బయోస్టిమ్యులెంట్స్ విక్రయాలను విజిలెన్స్ అధికారులు నిలుపుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు రీజియనల్ విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు జిల్లా ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం గుంటూరు ఏటుకూరు రోడ్‌లోని అమ్మ రోడ్ క్యారియర్స్ డైలీ పార్సిల్ సర్వీస్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఎటువంటి అనుమతులు, రికార్డ్స్ లేకుండా ఉన్న బయోస్టిమ్యులెంట్స్ ఎరువుల నిల్వలను గుర్తించారు. అయితే వ్యవసాయ శాఖ నుంచి జీ1, జీ2 అనుమతుల్లేకుండా రూ.2.50 లక్షలు ఖరీదు చేసే 210 లీటర్ల బయోస్టిమ్యులెంట్స్ స్టాక్ నిల్వ ఉంచినట్లు తనిఖీలో వెల్లడైంది. ఈ మేరకు వాటి అమ్మకాల నిలుపుదల చేయాలని నోటీసులు జారీచేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

డీఏటీఓ శివకామేశ్వరి



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఏటీఓ శివకామేశ్వరి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపఖజానా కార్యాలయం నుంచి ప్రతి నెల పింఛన్ తీసుకునే విశ్రాంత ఉద్యోగులు విధిగా లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 29లోగా ఉపఖజానా కార్యాలయంలో అందించాలని బాపట్ల జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఆర్.శివకామేశ్వరి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం చీరాల ఉపఖజానా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 2023- 24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చీరాల ఉపఖజానా కార్యాలయ పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు మండలాలలకు చెందిన ఉద్యోగులకు జీతాల బిల్లులు త్వరగా పంపించాలన్నారు. 72 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు ఉన్నారని, వారు కూడా త్వరగా చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎస్టీవోలు కె.భాగ్యలక్ష్మి, ఎం.సుబ్బారావు, షేక్ మీరావలి, సూపరింటెండెంట్ మధిర ఉన్నారు.

కోల్డ్ స్టోరేజీలకు నిబంధనలు తప్పనిసరి

మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులు అగ్నిప్రమాదాల నివారణకు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు హెచ్చరించారు. గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో కోల్డ్ స్టోరేజీల యాజమాన్యంతో యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అధ్యక్షతన శనివారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి సీజన్ ప్రారంభమైందని, అంతేకాకుండా వచ్చేది వేసవి కావడంతో కోల్డ్ స్టోరేజీలలో అగ్నిప్రమాదాల నివారణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. స్టోరేజీల నిర్వాహకులు అగ్నిమాపక శాఖ సూచనలను బేఖాతరు చేస్తున్నారని, అగ్ని ప్రమాదాలను నిలువరించే ముందస్తు పరికరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రమాదాల నివారణకు సంబంధించిన స్మోక్ డిటెక్టర్స్, ఎమర్జెన్సీ అలారం, ఫైర్ ఫైటింగ్ మిషన్స్, వాటర్ స్ప్రింకర్లు తదితరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కోల్డ్ స్టోరేజీలలో రైతులు, వ్యాపారులు నిల్వ చేసిన సరుకుకు వారి పేర్లతోనే తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. సరుకు నిల్వకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మార్కెట్ కమిటీకి తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని యాజమాన్యం ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా రైతుల సరుకుకు మార్కెట్ కమిటీ నిర్ణయించిన నామమాత్రపు ఫీజు మాత్రమే వసూలు చేయాలని, అందుకు విరుద్ధంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, కోల్డ్‌స్టోరేజీల అసోసియేషన్ నాయకులు ప్రకాశరావు, సురేంద్ర బాబు పాల్గొన్నారు.